# సాక్షి
## వైఎస్‌ఆర్ జిల్లా

బుధవారం ꠰ 8 ꠰ అక్టోబర్ ꠰ 2025






**వృద్ధురాలిని కట్టేసి నగల దోపిడీ**

ఒంటరి వృద్ధురాలి ఇంట్లోకి చొరబడిన దొంగలు ఆమెను కట్టేసి నగలు దోచుకెళ్లారు. సుమారు పది తులాల బంగారు ఆభరణాలు, నగదుతో పరారయ్యారు. - 8లో



**దుబాయి కరెన్సీ అంటూ దగా**

గతంలో నకిలీ బంగారం పేరుతో మోసం చేసిన మాయగాళ్ల గురించి విన్నాం.. వాటిపై నిఘా పెరిగిందనుకున్నారో.. ఏమో ఇక విదేశీ కరెన్సీ అంటూ ఎరవేసి దగా చేస్తున్నారు. - 8లో

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం
34.2 /24.4

జిల్లాలో మంగళవారం 24.4 - 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్.

## న్యూస్‌రీల్

### దరఖాస్తుల ఆహ్వానం

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** అన్నమయ్య జిల్లా రాయచోటి డిపోలో అసిస్టెంట్ మెకానిక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఐటీఐలో డీజిల్, మోటారు మెకానిక్‌లో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎంపికైన వారు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు రాయచోటిలోని డీఎం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

### రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీకి షోకాజ్ నోటీసు

**ప్రొద్దుటూరు :** రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డికి ఎన్నికల కమిషన్ షోకాజ్ నోటీసు జారీ చేసింది. 2021–24 సంవత్సరాలకు సంబంధించి ఆడిట్ చేయించకపోవడంతో నోటీసులు జారీ చేశారు. ఈ నెల 14న విజయవాడలోని స్టేట్ చీఫ్ ఎలక్షన్ కమిషన్ కార్యాలయంలో హాజరు కావాల్సి ఉందని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

### నవోదయలో ప్రవేశ దరఖాస్తులకు గడువు పెంపు

**తిరుపతి సిటీ :** జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈ నెల 21వ తేదీ వరకు పొడిగించినట్లు విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నవోదయ ప్రవేశ పరీక్షకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ, అర్హతలతో పాటు ఇతర వివరాల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్–నవోదయ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్, లేదా 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### ఏఐఏఏఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా సత్తార్ ఫైజీ ఎంపిక



**కడప ఎడ్యుకేషన్ :** ఆలిండియా అదబ్ ఎ అత్ఫాల్ సొసైటీ(ఏఐఏఏఎస్) రాష్ట్ర బాల సాహితీ సొసైటీ అధ్యక్షుడిగా ప్రముఖ ఉర్దూ బాల సాహితీవేత్త సత్తార్ ఫైజీ ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన సి. కె. దిన్నె మండలం మూలవంక జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. తన ఎంపికపై ఫైజీ సంతోషం వ్యక్తం చేశారు. నవంబర్ 11, 12, 13 తేదీల్లో మూడు రోజుల పాటు హైదరాబాద్ నగరంలో జష్నే రంగే బచ్పన్ పేరుతో అంతర్జాతీయ ఉర్దూ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెమినారు, ముషాయిరా, బాల సాహితి ఉర్దూ పుస్తకాల ఆవిష్కరణ, నాటికలు, పుస్తకాల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

### జీఎస్టీ తగ్గింపుతో ఆరోగ్య రంగానికి ప్రయోజనం



ఆరోగ్య సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు


**కడప రూరల్ :** జీఎస్టీ తగ్గింపు వల్ల ఆరోగ్య రంగానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య భవిత భీమా పాలసీ ప్రీమియంపై 18 శాతం జీఎస్టీని పూర్తిగా తగ్గించారన్నారు. ఈ సందర్భంగా సంధ్యా సర్కిల్ కూడలిలో ప్రతిజ్ఞ చేశారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ సేల్స్ టాక్స్ ఆఫీసర్ పద్మావతి డాక్టర్ శశిభూషణ్ రెడ్డి, డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, డాక్టర్ రవి బాబు, ప్రోగ్రాం ఆఫీసర్ భారతి, మలేరియా అధికారి మనోరమ పాల్గొన్నారు.

### వైభవంగా సీతారాముల పౌర్ణమి కల్యాణం

**ఒంటిమిట్ట :** ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 10 గంటలకు సీతాసమేతుడైన శ్రీ కోదండ రాముడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని కల్యాణ వేదిక వద్ద అర్చకులు ఉత్సవమూర్తులను వేర్వేరుగా ఉంచారు. అనంతరం సీతారాములకు సుగంధద్రవ్యాలతో పాటు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్లతో అభిషేకాలు నిర్వహించారు. నూతన పట్టు వస్త్రాలు ధరింపజేసి, తులసి గజమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తరువాత సతీసమేతుడైన శ్రీ కోదండ రామస్వామికి ఆలయ అర్చకులు వైభవంగా పౌర్ణమి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# జిల్లాలో కొత్త రైల్వే లైన్

- మూడో ట్రాక్ నిర్మాణానికి సన్నద్ధం
- గుంతకల్ నుంచి ఓబులవారిపల్లె దాకా..
- బొగ్గు గూడ్స్ రైళ్లకే పరిమితం
- జిందాల్ సహకారంతో ఏర్పాటు



నందలూరు చెయ్యేరు నదిపై బ్రిటీషర్ల బ్రిడ్జి ఆనవాళ్లు కలిగిన ప్రదేశంలో.. నిర్మించనున్న మూడవ రైల్వే బ్రిడ్జి

**రాజంపేట :** ఉమ్మడి వైఎస్‌ఆర్ కడప జిల్లాలో కొత్తగా మూడో ట్రాక్ నిర్మాణానికి రైల్వేశాఖ సన్నద్ధమవుతోంది. ముంబయి–చెన్నై కారిడార్ మార్గంలో గుంతకల్లు నుంచి ఓబులవారిపల్లె వరకు ఈ లైను నిర్మించనున్నారు. ఇప్పటికే గుత్తి–రేణిగుంట మధ్య డబ్లింగ్(డబుల్ లైను ట్రాక్) ఉన్న సంగతి విదితమే. సిమెంటు, బొగ్గు, ఐరన్‌తోపాటు ఇతర సరుకుల రవాణా అధికంగా ఉంటుంది. దీంతో జిందాల్ సంస్థ సహకారంతో మూడో లైన్ వేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే డీపీఆర్ (డీటైల్ ప్రాజెక్టు రిపోర్టు) పూర్తయింది.

**గూడ్స్ రైళ్ల రాకపోకల కోసమే..**

మూడో లైను ట్రాక్ నిర్మితం కేవలం గూడ్స్‌రైళ్ల నిర్వహణకు కేటాయించే విధంగా కొనసాగించనున్నారు. అది కూడా జిందాల్ సంస్థకు బొగ్గు రవాణాను దృష్టిలో ఉంచుకొని.. ఈ లైను నిర్మాణానికి దారి తీసింది. జిందాల్ ఫ్యాక్టరీకి వెళ్లే గూడ్స్ రైళ్లకు ఈ ట్రాక్‌ను వినియోగించుకుంటారనే సమాచారం రైల్వే వర్గాల నుంచి వినిపిస్తోంది. 90 శాతం మేరకు జిందాల్ సంస్థకు రాకపోకలు సాగించే గూడ్స్ రైళ్లే నడవనున్నాయి. జిందాల్ సంస్థ, రైల్వే 50:50 శాతం భాగస్వామ్యంతో ఈ లైను నిర్మాణం చేపట్టనున్నట్లు రైల్వే వర్గాలు చెబుతున్నాయి. గడువు ముగిసిన తర్వాత థర్డ్‌లైను రైల్వేకి ఇచ్చే విధంగా విధానం కొనసాగుతుందని రైల్వే వర్గాలు భావిస్తున్నాయి. రెండేళ్లలో థర్డ్‌లైను నిర్మాణం పూర్తి చేసేందుకు అటు జిందాల్, ఇటు రైల్వే యుద్ధ ప్రాతిపదకన చర్యలు తీసుకుంటున్నాయి.

**ఓబులవారిపల్లె జంక్షన్ వరకే...**

కృష్ణపట్నం పోర్టు నుంచి ఓబులవారిపల్లె జంక్షన్ వరకు ఉన్న రైలుమార్గం దాకా థర్డ్‌లైన్ నిర్మాణం చేపట్టనున్నారు. గుత్తి–రేణిగుంట మధ్య ఫోర్‌లైన్ ట్రాక్స్ నిర్మాణానికి రైల్వేశాఖ సన్నద్ధమైంది. మొదటి విడత ప్రాధాన్యతగా గుంతకల్లు–ఓబులవారిపల్లె జంక్షన్ వరకు థర్డ్‌లైను ట్రాక్ వేసేందుకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు.

**భూసేకరణ.. సరిహద్దులపై దృష్టి**

థర్డ్‌లైన్ నిర్మితానికి అవసరమయ్యే భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. 3, 4 లైనుకు సంబంధించిన అవసరమైన భూసేకరణ, రైల్వే స్థల సరిహద్దులపై దృష్టి సారించారు. నందలూరు రైల్వేకేంద్రం మినహాయించి అన్ని స్టేషన్‌లలో.. అదనంగా 3, 4 రైల్వేట్రాక్ వేయాల్సి ఉంటుంది.

**చెయ్యేరు నదిపై బ్రిడ్జి**

నందలూరు చెయ్యేరు నదిపై థర్డ్ లైను నిర్మాణానికి అవసరమయ్యే బ్రిడ్జి నిర్మితం చేయడానికి సర్వే పూర్తయింది. బ్రిటీషర్ల హయాంలో ఏర్పాటైన బ్రిడ్జి స్థానంలో మూడవ బ్రిడ్జి నిర్మితం చేయనున్నారు. అయితే 3, 4 లైనుకు సరిపడే విధంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నారు.

**రేణిగుంట–ఓబులవారిపల్లె..**

రేణిగుంట–ఓబులవారిపల్లె (56 కి.మీ) మధ్య కూడా మూడవ, నాల్గవ లైను నిర్మితం చేయాల్సి వుంటుంది. అయితే ఓబులవారిపల్లె వరకు థర్డ్‌లైను నిర్మాణం పూర్తి చేయనున్నారు. కృష్ణపట్నం పోర్టుకు గూడ్స్ రైళ్ల రాకపోకలను సకాలంలో నిర్వహించేందుకే.. ముందుగా థర్డ్‌లైను నిర్మితంపై దృష్టి సారించారు.



### గూడ్స్ రైళ్ల రద్దీ

గూడ్స్‌రైళ్ల రద్దీ అధికంగా కొనసాగుతోంది. గుంతకల్ టు వయా ఓబులవారిపల్లె మీదుగా కృష్ణపట్నం పోర్టుకు లోడింగ్, అన్‌లోడింగ్‌తో కలుపుకొని 40 గూడ్స్ రైళ్లు పరుగులు తీస్తున్నాయి. ఉన్న డబ్లింగ్‌లో ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లతో పాటు ఇతర గూడ్స్ రైళ్ల ట్రాఫిక్‌తో.. కృష్ణపట్నం పోర్టు గూడ్స్ రైళ్లు గమ్యాలకు చేరడంలో ఆలస్యం అవుతోంది. నందలూరు రన్నింగ్‌స్టాఫ్ క్రూసెంటర్ కేంద్రంగా ఈ గూడ్స్‌రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే రైల్వేబోర్డు నందలూరు క్రూసెంటర్‌ను బలోపేతం చేసే దిశగా దృష్టి సారించిన సంగతి తెలిసిందే.

# భద్రతా నిబంధనలు తప్పనిసరి

**కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

**కడప సెవెన్‌రోడ్స్ :** బాణసంచా గోడౌన్ల నిర్వాహకులు ఫైర్, భద్రతా నిబంధనలు (సేఫ్టీ మెజర్స్) ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ రూమ్ హాలులో దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా స్టాళ్ల అనుమతులు, భద్రతా చర్యలు, నిబంధనల పాటింపు తదితర అంశాలపై ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కడప, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ డివిజన్‌లలో బాణసంచా దుకాణదారులకు లైసెన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు, అన్ని రకాల భద్రత చర్యలను పాటిస్తూ.. సంప్రదాయ పండుగను సంతోషంగా నిర్వహించుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం జారీ చేసిన విధివిధానాలను తప్పకుండా పాటించాలన్నారు. కమ్యూనిటీ ఓపెన్ ఏరియాలలో క్రాకర్స్ వినియోగించేలా చూడాలన్నారు. అలాగే పాఠశాలల్లో పిల్లలకు టపాసుల వినియోగం, భద్రతపై అవగాహన పెంచాలన్నారు. రెవెన్యూ, పోలీస్, ఫైర్, విద్యుత్ శాఖలు ఎప్పటికప్పుడు అలర్ట్‌గా ఉండాలన్నారు. అలాగే కమర్షియల్ టాక్స్ అధికారులు అన్ని డివిజన్లోని ఆర్డీవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి.. ఎక్కడైనా ఇల్లీగల్ స్టోరేజ్ పాయింట్లు కనపడితే వెంటనే వాటిని సీజ్ చేసి చర్యలు చేపట్టాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో.. బాణసంచా విక్రయ కేంద్రాలకు పరిమిత సంఖ్యలో అనుమతులు ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎక్కడ పడితే అక్కడ బహిరంగంగా బాణసంచా దుకాణాలు నిర్వహిస్తే.. విక్రయదారులపై కేసులు నమోదు చేయాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడప, బద్వేలు, జమ్మలమడుగు, పులివెందుల ఆర్డీఓలు జాన్ ఇర్విన్, చంద్ర మోహన్,సాయి శ్రీ,చెన్నయ్య జిల్లా చీఫ్ ఫైర్ ఆఫీసర్ సాయి ధర్మా రావు,అడిషనల్ మున్సిపల్ కమిషనర్ రాకేష్ ,మున్సిపల్ కమిషనర్లు, ఫైర్, రెవెన్యూ, పోలీసు, రెవెన్యూ, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**'సూపర్ జీఎస్టీ'పై మరింత అవగాహన**

ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. జిల్లాలో సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌పై చేస్తున్న అవగాహన కార్యక్రమాల అమలు తీరు పై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో కలెక్టర్ మంగళవారం రాత్రి వీసీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో జేసీ అదితి సింగ్, జీఎస్టీ జాయింట్ కమిషనర్,జిల్లా సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ నోడల్ అధికారి జి. సుమతి,జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారిన ధరల విషయంపై ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రతి రోజు చేసిన కార్యక్రమాలపై డేటా ఎంట్రీ ఖచ్చితంగా చేయాలన్నారు. ఈ నెల 10,11 తేదీల్లో కడప కళా క్షేత్ర ప్రాంగణంలో సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్, గృహోపకరణాల ప్రదర్శన, సేల్స్ కార్యక్రమ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధింత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జడ్పీ సీఈఓ ఓబులమ్మ, జిల్లా వైద్య శాఖ అధికారి నాగరాజు, డ్వామా, డీఆర్డిఏ పీడీలు ఆదిశేషారెడ్డి, రాజ్యలక్ష్మి, డీఈఓ శంషుద్దీన్,జిల్లా పర్యాటక శాఖ అధికారి సురేష్, తదితర అధికారులు పాల్గొన్నారు.

# మహర్షి వాల్మీకి.. అందరికీ ఆదర్శనీయులు



వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

**కడప సెవెన్‌రోడ్స్ :** భారతీయ ఇతిహాసాన్ని, మానవ సంబంధాలు, కుటుంబ విలువల సారాంశాన్ని అపురూపమైన రామాయణ గ్రంథంగా సమాజానికి అందించిన 'వాల్మీకి మహర్షి' భావితరాలకు ఆదర్శనీయమని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వర నాయుడు తోపాటు రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ యాదవ్, ఎస్డీసీ వెంకటపతి, జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి అంజల హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన పలువురు వక్తలు రామాయణ ప్రాశస్త్యం, వాల్మీకి పురాణం, సమాజంలో వాల్మీకి వర్గాల పరిస్థితులు, రిజర్వేషన్ మొదలైన అంశాలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో వివిధ బీసీ కులసంఘాల నాయకులు, ప్రతినిధులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ఇతర శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

**మానవతా విలువలు పెంపొందించుకోవాలి**

**కడప అర్బన్:** రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆకాంక్షించారు. కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) కె. ప్రకాష్ బాబు, ఎ.ఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, ఏ.ఆర్ డీఎస్పీ నాగేశ్వరావు, ఆర్.ఐ లు శివరాముడు, టైటాస్, శ్రీశైల రెడ్డి, ఆర్.ఎస్.ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- సీపీడబ్ల్యూ స్కీమ్‌లకు విద్యుత్ సౌకర్యం
- తాగునీటి కోసం కొత్త బోర్ల ఏర్పాటు
- జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవింద రెడ్డి




జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి

**కడప సెవెన్‌రోడ్స్ :** జిల్లాలో చేపట్టిన, చేపట్టబోయే అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ ముత్యాల రామగోవింద రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో నిర్వహించిన జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ బద్వేలు, గోపవరం, పోరుమామిళ్ల, బ్రహ్మంగారిమఠం మండలాల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి టెండర్లు పిలిచి నాలుగు నెలల్లో పనులు పూర్తి చేయాలని చెప్పారు. వేంపల్లె షాపింగ్ కాంప్లెక్స్‌కు మరమ్మతులు నిర్వహించాలని ఆదేశించారు. చక్రాయపేటలోని సీపీడబ్ల్యూ స్కీమ్ మోటారు కాలిపోవడంపై ఆయన ఆరా తీశారు. ఎర్రగుడి సీపీ డబ్ల్యూ స్కీమ్‌కు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వచ్చేవరకు అద్దె ట్రాన్స్‌ఫార్మర్ వినియోగించాలని సూచించారు. గండిక్షేత్రంలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి తొలుత రూ. 25 లక్షల అంచనా వ్యయంతో టెండర్లు పిలవాలన్నారు. రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, చక్రాయపేట మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటాయన్నారు. ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా అవసరమైన చోట్ల కొత్త బోర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. టెండర్లు నామినేషన్లపై ఇస్తున్నారంటూ ఆడిట్ అధికారి తెలిపారు.

- వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ బిల్లులే రాకపోతే టెండర్లు వేసేందుకు ఎవరు ముందుకు వస్తారంటూ ప్రశ్నించారు. ఏవైనా పనులకు టెండర్లు పిలవాలంటే ముందుగా పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని జెడ్పీ చైర్మన్ సూచించారు.
- అర్హత లేని వారికి పెన్షన్లు ఇచ్చారని, ఇప్పుడు వాటిని తొలగిస్తుంటే ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తోందని పులివెందుల జెడ్పీటీసీ అన్నారు. దీనిపై జెడ్పీ చైర్మన్ స్పందిస్తూ అనర్హులకు ఇవ్వడాన్ని తాము కూడా వ్యతిరేకమేనన్నారు. ఒకరికి అర్హత లేదని ఒక డాక్టర్ సర్టిపై చేసిన తర్వాత అతను అప్పీలుకు వెళితే మరో డాక్టర్ అర్హత ఉన్నట్లుగా సర్టిఫికెట్ ఇస్తున్నారని పేర్కొన్నారు. అప్పుడు ఏ డాక్టర్‌ది తప్పంటూ చైర్మన్ ప్రశ్నించారు. తొలుత పెన్షన్‌కు అర్హులంటూ సర్టిఫికెట్ ఇచ్చిన డాక్టర్‌ను సస్పెండ్ చేయాలని అభిప్రాయపడ్డారు.
- కో ఆప్షన్ సభ్యులు కరీముల్లా మాట్లాడుతూ డెంగీ జ్వరాలు వస్తుంటే ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారని తెలిపారు. రిమ్స్‌లో ప్లేట్‌లెట్స్ కౌంట్ పరీక్షలు నిర్వహిస్తున్నారా? అంటూ ప్రశ్నించారు. రిమ్స్‌లో ప్లేట్‌లెట్స్ ఎక్కిస్తున్నారన్న విషయం ప్రజలకు తెలియదని, దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. దోమల బెడద అధికంగా ఉందని, ఫాగింగ్ యంత్రాలు మూలన పడేశారని విమర్శించారు. దీనిపై జెడ్పీ చైర్మన్ స్పందిస్తూ ఆ యంత్రాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.
- పార్నపల్లె రిజర్వాయర్ నుంచి వేముల మండలంలోని నాయని చెరువుకు గ్రావిటీపై సాగునీరు వస్తోందని వేముల జెడ్పీటీసీ బయపురెడ్డి అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ లేని కారణంగా భూమయ్యగారిపల్లె, రాచకుంటపల్లె, బక్కన్నగారిపల్లెకు నీటిని లిఫ్ట్ చేయలేని పరిస్థితి నెలకొందని తెలిపారు.
- పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ మాట్లాడుతూ డీఎస్సీ నియామకాల్లో షెడ్యూల్ కులాల్లోని మూడవ కేటగిరీకి చెందిన వారికి అన్యాయం జరిగిందన్నారు. అర్హత సాధించి వెరిఫికేషన్ పూర్తయినప్పటికీ హారిజెంటల్ పద్ధతిలో నియామకాలు చేపట్టి అన్యాయం చేశారని ఆరోపించారు. జీఓ నెం. 77 ప్రకారం నియామకాలు చేపట్టకుండా హారిజెంటల్ పద్ధతిని అనుసరించడం వల్ల ఈ అన్యాయం జరిగిందని, దీనిపై పునః పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, పలువురు జెడ్పీటీసీలు, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నారావారి సారాపై కేంద్రం దృష్టి సారించాలి

- జిల్లా ఎస్పీ ని కలిసిన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి
- పులివెందులలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకులపై నమోదు చేసిన అక్రమ కేసులపై ఎస్పీకి వివరించిన ఎంపీ



ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌ను కలిసిన తరువాత మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

**కడప అర్బన్ :** రాష్ట్రంలో నారా వారి సారా (ఎన్ బ్రాండ్) పై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని.. మద్యం కుంభకోణంపై కూటమి ప్రభుత్వం పెద్దలను సమగ్రంగా విచారణ జరిపించాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌ను కలిశారు. పులివెందులలో వైఎస్‌ఆర్ సీపీ నాయకులపై ఇటీవల నమోదు చేసిన అక్రమ కేసులపై ఎస్పీకి వివరించి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల వెలుగుచూసిన నకిలీ మద్యం కుంభకోణంతో నారావారి సారా ఏ స్థాయిలో అమ్ముతున్నారో బహిర్గతమైందన్నారు. 111 కోట్ల క్వార్టర్ బాటిళ్లు అమ్ముడు పోతే వీటిల్లో 48 కోట్ల క్వార్టర్ బాటిళ్ల కేసులు నకిలీ మద్యానికి సంబంధించినవేనని, సుమారు రూ. 5280 కోట్ల విలువైన అమ్మకాలు నకిలీ మద్యం రూపంలో జరిగాయని ఆరోపించారు. ఏడాది కాలంలోనే ప్రజల ఆరోగ్యంపై ఎలాంటి శ్రద్ధ లేకుండా నకిలీ మద్యం అమ్మకాలు చేసుకున్నారని ధ్వజమెత్తారు. రూ. 5280 కోట్ల కుంభకోణానికి తెర లేపారన్నారు. అన్నమయ్య జిల్లాలోని మొలకలచెరువు, కృష్ణా జిల్లా సాక్షిగా అవినీతి బట్టబయలైందన్నారు. మొలకలచెరువు నుంచి రాయలసీమకు, కృష్ణా జిల్లా నుంచి కోస్తా, ఉత్తరాంధ్ర ప్రాంతానికి నకిలీ మద్యాన్ని సరఫరా చేశారని ఆరోపించారు. బాటిళ్లకు వేసే సీళ్లు మాత్రమే ఒరిజినల్ అనీ, సీసాలోని మద్యం మాత్రం నకిలీదనీ తేలిపోయిందన్నారు. ఆధారాలతో అడ్డంగా దొరికినా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని మండిపడ్డారు. ఇంత అవినీతి జరిగినా కూటమి ప్రభుత్వ నేతలు సిగ్గులేకుండా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. ప్రభుత్వానికి నకిలీ మద్యం కుంభకోణానికి సంబంధంలేదని తయారీదారుని చేత వీడియోలను విడుదల చేయడంలోనే ప్రభుత్వానికి సంబంధం ఉందనీ ఇట్టే తేలిపోయిందన్నారు. అధికార అగ్రనాయకులు సంప్రదించాకే ఆ వీడియో బయటకు వచ్చిందన్నారు. అగ్ర నాయకులు తనను కాపాడతారనే హామీతో అమాయకంగా ఆ వీడియోను విడుదల చేసినట్లుగా అనిపిస్తోందన్నారు. భవిష్యత్తులో చంద్రబాబు నాయుడు నకిలీ మద్యం విషయంలో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణకు ఆదేశించాలని కోరారు. పులివెందులలో వైఎస్‌ఆర్ సీపీ నాయకులపై అక్రమంగా కేసులను స్థానిక పోలీసులు నమోదు చేశారని, వాటిని వివరించేందుకు ఎస్పీని కలిశామన్నారు.

**పంటలకు గిట్టుబాటు ధరను చెల్లించాల్సిందే..**

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా పనిచేసినంత కాలం రైతులకు గిట్టుబాటు ధరను కల్పించి ప్రయోజనం చేకూర్చామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పట్టించుకోలేదనీ కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. చక్రాయపేట, వేంపల్లి, మైదుకూరు తదితర ప్రాంతాలలో వరి పండించే రైతులకు గిట్టుబాటు ధర లేకుండా పోయిందన్నారు. 81 కిలోలకుగాను రూ. 1000 నుంచి 1300 మాత్రమే అమ్ముడుపోతున్నాయన్నారు. ప్రభుత్వం చొరవతీసుకుని సివిల్ సప్లయిస్ డీఎం ద్వారా వరికి రూ. 2369 లమేరకు గిట్టుబాటు ధరను కల్పించాలన్నారు. చీనీ, వరి పంటలకు గిట్టుబాటు ధరను కల్పించాలన్నారు. కలెక్టర్‌ను కలిసి రైతులకు న్యాయం చేయాలని కోరతామన్నారు. వైఎస్‌సీపీ మాజీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్‌కుమార్, మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ షఫీవుల్లా, యువజన విభాగం ప్రశాంత్‌రెడ్డి, మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు రక్షిత్ రెడ్డి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థికి గోల్డ్ మెడల్



శైలజను అభినందిస్తున్న ప్రిన్సిపల్, కోఆర్డినేటర్

కడప ఎడ్యుకేషన్ : కడప ప్రభుత్వ పురుషుల కళాశాల(స్వయం ప్రతిపత్తి)లోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ విద్యార్థిని అంకాల శైలజ (ఎం.కామ్ 2022–24 బ్యాచ్) గోల్డ్ మెడల్ సాధించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారం అందుకున్నారు. కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ బయ్యపురెడ్డి విద్యార్థిని ప్రతిభను అభినందించారు.

### బస్సు డ్రైవర్‌పై దాడి



దాడిలో గాయపడిన ఆర్టీసీ డ్రైవర్ మహ్మద్

దువ్వూరు : ఆళ్లగడ్డ–మైదుకూరు మధ్య తిరుగుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ప్రయాణికుడు దాడి చేశాడు. పోలీసుల వివరాల మేరకు.. ఆళ్లగడ్డ – మైదుకూరు మధ్య నడుస్తున్న ఆర్టీసీ హయర్ బస్సులో దువ్వూరులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రయాణికులు ఎక్కారు. అందులో ఒకాయనకు కంటిచూపు లేదు.. బస్సు ఎక్కేలోపే బస్సును కదిలించావు. బస్సు ఎలా నడపాలో తెలియదా..అంటూ వంటూ హేమవర్ధన్ అనే ప్రయాణికుడు వాగ్వాదానికి దిగాడు. దీంతో డ్రైవర్ మహ్మద్ బస్సునిండా ప్రయాణికులున్నారని, ఎక్కవద్దని చెప్పాను కదా అంటూ వాదించాడు. గుడిపాడు దగ్గరకు రాగానే బస్సు దిగి డ్రైవర్‌పై రాయితో హేమవర్ధన్ దాడిచేశాడు. డ్రైవర్ తలకు తీవ్ర రక్తగాయమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దువ్వూరు ఎస్‌ఐ వినోద్ కుమార్ తెలిపారు.

### ఏడుగురు జూదరుల అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని ఎర్రగుంట్ల రోడ్డులోని ఏకో పార్కు సమీపంలో పేకాడుతున్న ఏడుగురిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్‌ఐలు అరుణ్‌రెడ్డి, కేపీ రాజు సిబ్బందితో కలిసి పేకాట స్థావరాలపై మంగళవారం దాడులు నిర్వహించారు. ఏడుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.81వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

### చిట్టీ డబ్బు చెల్లించలేనంటూ..

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలో ఎనిమిదేళ్లు పనిచేసిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు చిట్టీలు నిర్వహిస్తూ సకాలంలో డబ్బులు చెల్లించేవాడు. దీంతో ఉపాధ్యాయులతోపాటు స్థానికుల్లో నమ్మకం కుదిరింది. భారీ సంఖ్యలో ఇతడి వద్ద చిట్టీలు వేశారు. రూ.4 కోట్లు చెల్లించాల్సి ఉంది. మూడు రోజులు క్రితం తాను డబ్బు చెల్లించాల్సిన వ్యక్తుల ఫోన్ నెంబర్లతో ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటుచేసి చిట్టీ డబ్బులు చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నానని చెప్పుకున్నాడు.

# దుబాయి కరెన్సీ అంటూ దగా

- చిత్తు కలర్ పేపర్ల చుట్ట చేతిలో పెట్టారు
- రూ.4.5 లక్షలు దోచుకున్న దుండగులు



పోలీసుల అదుపులో నిందితులు

రాయచోటి టౌన్ : గతంలో నకిలీ బంగారం పేరుతో మోసం చేసిన మాయగాళ్ల గురించి విన్నాం.. వాటిపై నిఘా పెరిగిందనుకున్నారో.. ఏమో ఇక విదేశీ కరెన్సీ అంటూ ఎరవేసి దగా చేస్తున్నారు. రాయచోటిలో చోటు చేసుకున్న ఈ సంఘటనే ఇందుకు అద్దం పడుతోంది. రాయచోటి అర్బన్‌పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ కృష్ణ మోహన్ విలేకరులకు మంగళవారం వివరాలు వెల్లడించారు. ఢిల్లీకి(వాయువ్య ఢిల్లీ) చెందిన హారూన్, తూర్పు ఢిల్లీకి చెందిన మిరాజ్, మధ్య ప్రదేశ్ రాష్ట్రం జబల్పూర్‌కు చెందిన నూర్ మహమ్మద్ ఖాన్‌లు రాయచోటిలో మకాం వేశారు. పట్టణంలోని షాపుల వద్దకు వెళ్లి వారితో( హిందీ మాట్లాడే వారితోనే) మాటా మాటా కలుపుతారు. పరిచయం పెంచుకొని తాము వ్యాపారం నిమిత్తం ఇక్కడికి వచ్చామని.. తమ వద్ద దుబాయ్ దేశానికి చెందిన కరెన్సీ( దిర్హం) నోట్లు ఎక్కువ ఉన్నాయని చెబుతారు. నమ్మించడానికి ఒకటి.. రెండు చూపిస్తారు. 100 దిర్హం నోటు ధర ఇండియన్ కరెన్సీ నోట ధర ప్రకారం రూ.2400 పలుకుతున్నట్లు నమ్మిస్తారు. వీరు కూడా ఆన్‌లైన్ ద్వారా కానీ ఇతరుల ద్వారా కానీ విచారణ సాగించి నమ్ముతారు. శాంపిల్‌గా ఇచ్చిన నోట్లు ఒరిజనల్‌వే కావడంతో దుకాణదారులు నమ్మారు. అంతేగాక తమ వద్ద ఎక్కువ నోట్లు చూస్తే సమస్య వస్తుందని, నోటు తీసుకుంటే దిర్హం రూ.1000కే దుండగులు దుకాణదారులను నమ్మించారు. దీనిని నమ్మిని ఒక వ్యక్తి రూ.4.5 లక్షలు నగదు ఇచ్చాడు. రాయచోటి రింగ్ రోడ్డు వద్దకు రమ్మని చెప్పి స్థానికుడి నుంచి రూ.4.5లక్షలు నగదు తీసుకొని ఆ వ్యక్తికి దుబాయ్ నోట్ బయటికి కనిపించే విధంగా టవల్ మధ్యలో కలర్ పేపర్లు ఉంచి ఒక చుట్ట చుట్టి వారికిచ్చి అక్కడ నుంచి పారిపోయారు. మూట తెరిచి చూడగా అందులో పూర్తిగా రంగు రంగుల పేపర్లు చుట్టి ఉండడంతో దుకాణదారు లబోదిబో మంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడని డీఎస్పీ చెప్పారు. అర్బన్ సీఐ బివి చలపతి, ఎస్సై బాలకృష్ణ, స్పెషల్ పార్టీ సిబ్బంది శ్రీను, మల్లిఖార్జున వేగవంతంగా విచారణ సాగించి రాయచోటి–కడప రోడ్డు సమీపాన అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. విచారణ వేగంగా చేసి నిందితులను పట్టుకున్న అధికారులను జిల్లా ఎస్పీ అభినందించారని, రివార్డు కోసం వారి పేర్లు పంపామని తెలిపారు.

# వృద్ధురాలిని కట్టేసి నగల దోపిడీ

పట్టపగలే ముగ్గురు దొంగల నిర్వాకం



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

చింతకొమ్మదిన్నె : ఒంటరి వృద్ధురాలి ఇంట్లోకి చొరబడిన దొంగలు ఆమెను కట్టేసి నగలు దోచుకెళ్లారు. మండల పరిధిలోని కొప్పర్తి గ్రామంలోని రహదారి ప్రక్కనే నివాసముంటున్న కోగటం సరస్వతమ్మ భర్త వెంకట సుబ్బారెడ్డి వీఆర్వోగా పని చేస్తూ ఇటీవల మృతిచెందారు. ఈమె ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు, కుమార్తెకు వివాహమై కడపలో నివాసం ఉంటోంది. దీంతో సరస్వతమ్మ ఒంటరిగా నివాసమయుంటోంది. సోమవారం మధ్యాహ్నం సమయంలో ముగ్గురు యువకులు బైక్‌లో ఆమె ఇంటికి వచ్చారు. పక్కా రెక్కీ నిర్వహించిన దొంగలు ఆమె ఇంటిపై బాడుగకు ఉంటున్న వ్యక్తికి వివాహ పత్రిక ఇవ్వడానికి వచ్చినట్లు నమ్మించారు. పెన్ను ఇస్తే అడ్రస్ రాసి ఇస్తామని అడగ్గా.. సరస్వతమ్మ పెన్ను కోసం వెళ్లింది. ఇంతలో దొంగలు ఆమె వెనుకే వెళ్లి నోరు నొక్కి, చేతులు, కాళ్ళు కట్టేసి బెడ్ రూములోకి లాక్కెళ్లారు. అరిస్తే చంపేస్తాం అంటూ బెదిరించారు. ఆమె మెడలోని బంగారు చైన్, చేతి గాజులు, ఉంగరాలు, చెవి కమ్మలు బలవంతంగా లాక్కుని, బీరువా, అల్మారా తెరిచి అందులోని, బంగారు నగలు, నగదు దోచుకున్నారు. మొత్తం పది తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదు, విలువైన వస్తువులు తీసుకెళ్లినట్లు వృద్ధురాలు తెలిపారు. కొంతసేపటికి కట్లు విప్పుకొని గట్టిగా అరవడంతో చుట్టు ప్రక్కల వారు వచ్చి సపర్యలు చేశారు. బంధువులతో వచ్చి పోలీసులకు సమాచారం తెలిపారు. డీఎస్పీ స్పందించి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో వచ్చి పరిశీలించారు. చింతకొమ్మదిన్నె సీఐ బాల మద్దిలేటి, ఎస్‌ఐ శ్రీనివాసులరెడ్డిని సంప్రదించగా ముగ్గురు వ్యక్తులు కలిసి దోపిడీ చేసినట్లు ఫిర్యాదు అందించని, నేరం చేసిన వారిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

### యూత్ వాలంటీర్ల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : సమాజసేవ నిమిత్తం పనిచేసేందుకు అర్హత కలిగిన యూత్ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్ తెలిపారు. 18–29 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, పదో తరగతి అర్హతతో, స్వచ్ఛంద సేవ చేయగలిగే వారు దరఖాస్తు చేయాలన్నారు. ఎంపికైౖ వారికి నెలకు రూ.5000 ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. ఎంపికైన వారంతా యువజన సంఘాల స్థాపన, క్రీడలు, ఆరోగ్యం , అక్షరాస్యత, పారిశుద్ధ్యం, లింగ వివక్ష, ఇతర సామాజిక అంశాలపై ప్రజలను చైతన్య పరచే కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. కంప్యూటర్ అప్లికేషన్స్, ఆండ్రాయిడ్ ఫోన్ కలిగి ఉండి ఈ–బ్యాంకింగ్, డిజిటల్ విధానంపై అవగాహన ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ పద్ధతిలో ht pr:// nyk-r. nic.i n/ Na-t-io na Cor pr/ nyc.-h-t-ml ద్వారా దరఖాస్తు చేసుకొనవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు కడప నెహ్రూ యువ కేంద్రం, బాలాజీనగర్, రోడ్ నెంబర్ 13లో సంప్రదించాలని, ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పంపాలని కోరారు. అభ్యర్థులు కడప జిల్లా వాసులై ఉండాలని తెలిపారు. వివరాలకు 9908127829 నెంబర్‌ను సంప్రదించగలరని తెలిపారు.

### ఖతార్‌లో గాలివీడు వాసి మృతి

గాలివీడు : బ్రతుకుదెరువు కోసం గల్ఫ్ దేశమైన ఖతార్‌కు వెళ్లిన పఠాన్ ఫయాజ్ (29) మంగళవారం గుండె పోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానికుల కథనం మేరకు గాలివీడు పట్టణం గేటు నాలుగు రోడ్ల కూడలి వద్ద నివాసం వుంటున్న అజీజ్‌ఖాన్ కుమారుడు ఫఠాన్ ఫయాజ్ బ్రతుకు దెరువు కోసం ఖతార్ వెళ్లాడు. అయితే హఠాత్తుగా గుండెపోటు రావడంతో ఫయాజ్ మృతి చెందినట్లుగా కుటుంబ సభ్యులకు సమాచారం రావడంతో ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయారు. చిన్న వయసులోనే తమ బిడ్డ తమనుండి దూరమవ్వడం జీర్ణించుకోలేని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

### హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

గాలివీడు : మండలంలోని నల్లబత్తిన వాండ్లపల్లెకి చెందిన సుబ్బారాయుడు హత్య కేసులో ఆయన అన్న రాజుపాలెం నాగయ్య(74)కు జీవిత ఖైదు విధిస్తూ రాయచోటి కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. పోలీసుల కథనం మేరకు.. 2022 జూన్, 14న మల్లేశ్వరస్వామి మొక్కుబడి విషయంలో తోటిగాండిమడుగు వద్ద మేక నరికే విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ తరువాత సాయంత్రం 5 గంటల సమయంలో తమ్ముడు సుబ్బారాయుడుపై వేట కొడవలితో నాగయ్య దాడి చేయగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై గాలివీడు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. రాయచోటి జడ్జి ఎస్.కృష్ణన్ కుట్టి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

# పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో విఫలం



కరపత్రాలను అవిష్కరిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈపీఎఫ్ 95 పెన్షనర్ల పెండింగ్ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్. రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ నెల 12న ఈపీఎఫ్ పెన్షనర్ల సమస్యలపై నిర్వహిస్తున్న జిల్లా సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం పెన్షన్ భిక్ష కాదు, ఒక హక్కు అని గతంలో తేల్చి చెప్పినా పెన్షన్ రూపు మార్చి మోసాలకు పాల్పడుతున్నాయన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో కనీసం పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలన్నారు. 12వ పీఆర్సీ కమిషనర్‌ను నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. ఈ సదస్సుకు పెన్షనర్స్ అసోసియేషన్ అఖిల భారత కో ఆర్డినేషన్ నాయకులు ఎం.జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు హాజరవుతున్నట్లు తెలిపారు. అన్ని రంగాల పెన్షనర్లు పాల్గొని సదస్సు జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రామ్మూర్తినాయుడు, కళ్యాణ్ సుధాకర్, సాంబశివారెడ్డి, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



గాయపడిన వ్యక్తిని రిమ్స్‌కు తరలిస్తున్న సిబ్బంది

ఒంటిమిట్ట : మండలంలోని ఒంటిమిట్ట వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అట్లూరు మండలం కోనరాజుపల్లికి చెందిన బత్తల శ్రీను (38)ను ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయం వెనుకవైపు గేటు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన ఆయనను వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శ్రీను మృతిచెందారు.

# విద్యా రంగ సేవకుడికి విశిష్ట గౌరవం

భారత్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం



న్యూఢిల్లీ భారత్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకుంటున్న ఈశ్వరయ్య

కురబలకోట : విద్యారంగంలో విశేష కృషి చేసిన బి.ఈశ్వరయ్యకు న్యూఢిల్లీలో భారత్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. సాధారణ కుటుంబం నుంచి అంచెలంచెలుగా జిల్లా, రాష్ట్ర, జాతీ య స్థాయి గుర్తింపు సాధించిన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఈశ్వరయ్యకు ఈ పురస్కారం దక్కింది.


మండలంలోని ఎనుములవారిపల్లెకు చెందిన ఈశ్వరయ్య రిషి వ్యాలీ స్కూల్‌లో ప్రాథమిక విద్య అభ్యసించారు. మదనపల్లె బీటీ కళాశాలలో డిగ్రీ చదివి గోల్డ్ మెడల్ సాధించారు. ఎంఏ బీఈడీ చేసి విద్యారంగం వైపు మక్కువ చూపారు. రిషి వ్యాలీ రివర్ స్కూల్‌లో టీచర్‌గా, ఆ తర్వాత హెడ్మాస్టర్‌గా ఏడేళ్ల పాటు విధులు నిర్వహించారు. ఆ తర్వాత హైదరాబాద్ నాంది ఫౌండేషన్‌లో ఎడ్యుకేషనల్ రీసోర్సు పర్సన్‌గా నాలుగేళ్లు, న్యూఢిల్లీ హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో ప్రిన్సిపల్, డైరెక్టర్‌గా మూడేళ్లపాటు సేవలందించారు. అమెరికాలోని హార్వర్డ్ బిజినెస్ స్కూల్ విద్యార్థులు 200 మంది ఈశ్వరయ్య వద్దకు విమానంలో వచ్చి సలహాలు, తీసుకోవడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. ఆపై న్యూఢిల్లీ రాజీవ్ గాంధీ ఫౌండేషన్ హెడ్‌గా పదేళ్లపాటు పనిచేశారు. ఎస్‌సీఈఆర్టీలో రీసోర్సు పర్సన్‌గా గత ఏడేళ్లుగా కొనసాగుతున్నారు.

**విద్యా సంస్కరణల్లో కీలక పాత్ర**

విద్యా రంగంలో ఇతడి సేవలను గుర్తించిన గత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర స్థాయి విద్యా సంస్కరణల కమిటీ సభ్యుడిగా, రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ రిఫార్మ్ కమిటీలో రెగ్యులేటరీ, మానిటరింగ్ కమిషన్ కమిటీ సభ్యుడిగా సమున్నత స్థానం కల్పించింది. ఐదేళ్ల పాటు ఇతడు ఇన్ఫోసిస్ సుధానారాయణ మూర్తి, మరో తొమ్మిది మందిసభ్యులలో ఒకడిగా క్రియాశీలకంగా పనిచేశారు. అప్పట్లో ఎల్‌కేజీ నుంచి పీజీ వరకూ చదువులు ఎలా ఉండాలనే అంశంపై నివేదిక సమర్పణలో ఆయన కీలకంగా వ్యవహరించారు. రాష్ట్రంలోని అన్ని డైట్ కళాశాలలు తిరిగి.. ఆయన అందించిన సేవలకు ఇపుడు గుర్తింపు లభించింది. నీతి అయోగ్ పర్యవేక్షణలో నడిచే న్యూఢిల్లీ భారత్ వర్చువల్ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్లు 2025 సంవత్సరానికి ఇతనికి గౌరవ డాక్టరేట్ అవార్డు ఇచ్చి సత్కరించారు.

**ఏపీ, తెలంగాణా రాష్ట్రాలలో ఇతనికి ఒక్కడికే ఈ డాక్టరేట్ లభించడం మరో విశేషం.**

**సమాజ నిర్మాణంలో విద్య కీలకం**



సమాజ నిర్మాణంలో విద్యకు ప్రాధాన్యం ఉంది. విద్యార్థులకు చదువు నేర్పడం కన్నా ముందు వారిలో ఆత్మ విశ్వాసం నింపాలి. చదువు పట్ల భయం పోగొట్టాలి. బడి పట్ల ఇష్టం కలిగేలా చూస్తూ పుస్తకాలను చదివించేలా చూడాలి. ఈ గౌరవ డాక్టరేట్ అవార్డు విద్యా వ్యవస్థ గొప్పతనంగా నేను భావిస్తున్నాను. పేదరికాన్ని జయించడానికి చదువే గొప్ప అస్త్రం. ఎవ్వరైనా ఉన్నతంగా ఎదగడానికి చదువుకు మించిన ఆయుధం లేదు.

– ఈశ్వరయ్య



# ఆస్తి రాసిస్తే.. ఆదుకోనంటోంది..

ఆర్డీఓ ఎదుట వృద్ధ దంపతుల ఆవేదన



ఆర్డీఓ వద్ద వాదనలు వినిపిస్తున్న వృద్ధ దంపతులు, కుమార్తె

జమ్మలమడుగు రూరల్ : వృద్ధాప్యంలో తమను ఆదుకుంటుందనే ధీమాతో ఆస్థి రాసిచ్చాం.. ఇపుడు ఆదుకోము.. ఆస్తి వెనక్కు ఇవ్వమని చెప్పడం న్యాయం కాదని ఓ వృద్ధురాలు ఆర్డీఓ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన గూడురు నాగయ్య, భార్య వెంకటలక్ష్మమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు. అందరినీ ప్రయోజకులను చేసి వివాహాలు జరిపించారు. ఆస్తి అంతా వారికే ధారపోసి ఓ ఇంటిని తమకోసం ఉంచుకున్నారు. ఇపుడు వారు వృద్ధాప్యంలోకి అడుగిడడంతో తమకు అసరా కావాలని, తమను పోషిస్తే మోడంపల్లెలోని సొంత ఇంటిని వారి పేరిట రాసిస్తామని చెప్పారు. ఈ ఒప్పందానికి ముందుకు వచ్చిన రెండో కూదురికి ఇంటిని రాసి ఇచ్చారు ఆ వృద్ధ దంపతులు. కొన్ని నెలల తర్వాత వీరిని ఆదుకోకుంటూ ఆ కూతరు చేతులెత్తేసింది. కుమార్తె పట్టించుకోకపోవడం... ఇల్లు లేకపోవడంతో ఆ వృద్ధులు జమ్మలమడుగు ఆర్డీఓను ఆశ్రయించారు. దీంతో మంగళవారం కుటుంబ సభ్యులంతా ఆర్డీఓ ఎదుట హాజరయ్యారు. ఇక్కటే అసలు కథ మొదలైంది. ఆ ఇంటికి తగిన ధర చెల్లించి కోనుగోలు చేశానంటూ కుమార్తె చెప్పడంతో ఆర్డీఓ తల పట్టుకోవాల్సి వచ్చింది. తమను పోషించాలి.. లేకపోతే ఇంటిని వెనక్కు ఇస్తే అక్కడే ఉంటామని వృద్ధులు ఆర్డీఓకు చెప్పారు. ఇరువురూ వాదించుకుంటుండడంతో ఏమి చేయాలో తోచక తదుపరి వారానికి వాయిదా వేశారు. నలుగురు కుమార్తెలున్నా.. ఆ వృద్ధ దంపతులకు చట్టం ఏ మేరకు సహాయం అందుతుందో మరి.

# ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌కు పంచాయతీ నిధుల చెల్లింపు



సర్పంచ్‌కు విన్నవిస్తున్న అరిగాళ్ల మురళి



పంచాయతీ నిధులతో చెల్లించిన విద్యుత్తు బిల్లు

ఎర్రగుంట్ల : మండలంలోని చిలంకూరు జెడ్పీ పాఠశాల ఆవరణలో ఓ వ్యక్తి నిర్వహించే వాటర్ ప్లాంట్‌కు పంచాయతీ నిధులతో రూ.6 లక్షల విద్యుత్తు బిల్లులు చెల్లించారని, వెంటనే రికవరీ చేయించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు అరిగాళ్ల మురళి తెలిపారు. సర్పంచ్ శరత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీలతలకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ పంచాయతీ నిధులతో వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్న ప్రైవేటు వ్యక్తి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ ఏడాది మార్చి 26న రూ.28553, గత ఏడాది డిసెంబర్ 11న రూ.588994లు విద్యుత్తు బిల్లుల రూపంలో పంచాయతీ నిధులు చెల్లించారన్నారు. సర్పంచ్ శరత్‌కుమార్ వివరణ కోరగా.. ఈ విషయంపై విచారిస్తామన్నారు. ఆ ప్లాంట్ కరెంట్ మీటర్ వివరాలు సేకరించి తెలియజేస్తామన్నారు.

పంచాయతీ కార్యదర్శి శ్రీలత మాట్లాడుతూ సర్పంచ్ ఆదేశాల మేరకు విచారణ చేపబడుతామని, 15వ ఆర్థిక సంఘం నిధులు నుంచి కొంత శాతం కరెంట్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు న్నాయని తెలిపారు.

# మానసిక వైద్యశాల రాయలసీమ వాసులకు వరం

కడప ఐఎంహెచ్ సూపరింటెండెంట్ ఆర్.వెంకటరాముడు



మాట్లాడుతున్న డాక్టర్ ఆర్.వెంకటరాముడు

కడప అర్బన్ : రాయలసీమ వాసులకు కడప మానసిక వైద్యశాల వరంగా భావించాలని కడప ఐఎంహెచ్ (ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్) హాస్పిటల్ సూపరింటెండెంట్ ఆర్.వెంకట రాముడు అన్నారు. రిమ్స్ ఆవరణంలోని వంద పడకల మానసిక వైద్యశాల ఏడాదిన్నర కిందట ప్రజలకు అందుబాటులోకి రావడంతో ఈ నెల 4వ తేదీ నుంచి ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వెంకటరాముడు మాట్లాడుతూ 50 ఏళ్ల కిందట మానసిక వైద్యశాల ఏర్పాటుచేశారని, దాదాపు 10వేల మందికి దివ్యాంగుల సర్టిఫికెట్లు అందిచామని తెలిపారు. కేవలం సిటీ స్కాన్, ఎమ్మారై స్కాన్ల కోసం జిజిహెచ్‌కు రోగులను పంపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ధర తగ్గించి.. దళారులు దోచేస్తున్నారు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వేంపల్లె రైతులు



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యానికి కనీస మద్దతు ధర ప్రభుత్వం క్వింటాకు రూ.2369 ప్రకటించినప్పటికీ, దళారులు కేవలం రూ.1340 లతో కొనుగోలు చేస్తున్నారని వేంపల్లె మండల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అలిరెడ్డిపల్లె, తువ్వపల్లె, కుమ్మరాంపల్లె, ఇడుపులపాయ, వీరన్నగట్టుపల్లె గ్రామాలరైతులు కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరిని మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. రైతులు ఎక్కువగా వరి పంట సాగు చేస్తారని, అయితే గిట్టుబాటు ధర లేక వారు ఇబ్బంది పడుతున్నారన్నారు. కలెక్టర్ స్పందిస్తూ అధికారులతో మాట్లాడి రెండు, మూడు రోజుల్లోనే ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరతో రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పోతిరెడ్డి శంకరయ్య, వెంకట నారాయణరెడ్డి, బత్తల గంగాధర, తదితరులు పాల్గొన్నారు.

**పంట మద్దతు ధరపై కలెక్టర్‌తో చర్చించిన ఎంపీ**

పంట మద్దతు ధరపై పలువురు రైతులు మంగళవారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డితో మాట్లాడారు. గిట్టుబాటు కాక తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను సావధానంగా ఆలకించిన ఎంపీ ఈ విషయమై కలెక్టర్ శ్రీధర్, జేడీఏ చంద్రానాయక్‌తో మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కూడా రైతులకు దక్కడం లేదని.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని కలెక్టర్, జేడీఏ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# మినీ లారీ ఢీకొని ఒకరికి గాయాలు

108 వాహనంలో ఆస్పత్రికి తరలింపు



తీవ్రంగా గాయపడిన మోహన్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్డు సమీపంలోని ఏపీ కార్ల్ సమీపంలో మంగళవారం మినీ లారీ ఐచర్ వాహనం ఢీకొని మోహన్‌రెడ్డి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు..అనంతపురం జిల్లాకు చెందిన మోహన్ రెడ్డి గత కొంతకాలంగా పెద్దరంగాపురం సమీపంలో ఉన్న ఏపీ కార్ల్‌లో రీసెర్చ్ అసోసియేట్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం అనంతపురం నుంచి ఆయన భార్య బస్సులో పులివెందుల బస్టాండులో దిగింది. ఆమె భర్త మోహన్ రెడ్డికి ఫోన్ చేయడంతో ఆమెను ఏపీ కార్ల్‌లోని తమ నివాసానికి తీసుకెళ్లేందుకు ద్విచక్ర వాహనంలో బస్టాండ్ వద్దకు వస్తుండగా మినీ ఐచర్ లారీ ఢీకొంది. దీంతో మోహన్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రోడ్డులో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మోహన్‌రెడ్డికి ప్రథమ చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విపత్తుల నివారణపై మాక్ డ్రిల్



హెచ్‌పీసీఎల్‌లో మంటలను ఆర్పుతున్న సిబ్బంది

సిద్దవటం : విపత్తుల నివారణపై మండలంలోని భాకరాపేట హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ చిన్నారావు ఆధ్వర్యంలో మంగళవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ముందుగా హెచ్‌పీసీఎల్‌లోని ఎమర్జెన్సీ–1లోని ట్యాంకు వద్ద డీజిల్ లీక్ అవడంతో దాన్ని కంట్రోల్ చేసేందుకు సిబ్బంది పనిచేస్తుండగా స్కానర్ కిట్టు కింద పడి మంటలు చెలరేగాయి. అక్కడ ఉన్న వర్కర్లు ఫైర్ అని అరవడంతో హెచ్‌పీసీఎల్ సిబ్బంది సైరన్ మోగించారు. సిబ్బంది అప్రమత్తమై ఆటోమేటిక్ పరికరాలతో ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో పెట్రోల్ డిపో సిబ్బంది సహకారంతో ఫోమ్, వాటర్‌తో మంటలను అదుపు చేశారు. అక్కడ ఇద్దరు వర్కర్లకు ప్రమాదం జరగడంతో వారిని మెడికల్ క్యాంపుకు సిబ్బంది తీసుకొచ్చే సన్నివేశాన్ని మాక్ డ్రిల్ చేసి చూపించారు. అలాగే ఫిల్టర్–ఎ వద్ద డీజిల్ ఓవర్ లీక్ అవుతుండటంతో ఇలాగే చేశారు. ఇదంతా మాక్ డ్రిల్ అని తెలిసింది. చిన్నారావు మాట్లాడుతూ చట్ట ప్రకారం ప్రతి 6 నెలలకు ఒకసారి మాక్ డ్రిల్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ సిబ్బంది పాల్గొన్నారు.